క్లుప్తంగా

సైన్స్ ఎగ్జిబిషన్‌లో అక్షర విద్యార్థుల ప్రతిభ



సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రయోగాలను ప్రదర్శించిన అక్షర విద్యార్థులు

బోట్‌క్లబ్: ఇటీవల విజయవాడలో నిర్వహించిన సీబీఎస్‌ఈ రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో స్థానిక అక్షర విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న టి.వినయ్ జయేష్, వి సాయిరామ్, సైన్స్ ఉపాధ్యాయులు కెన్నీ మార్టిన్, సుమని పర్యవేక్షణలో హైబ్రిడ్ ఇంజిన్ ప్రాజెక్టును ప్రదర్శించి త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఎంపికయ్యారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను స్కూల్ ధర్మకర్త వేదారాజు, పాఠశాల సెక్రటరీ జీవీఎన్ రాజు, పాఠశాల హెచ్‌ఎం ఎ.గోపాలకృష్ణ అభినందించారు.

హైందవ శంఖారావానికి తరలండి

కరప: దేవాలయాల రక్షణ కోసం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జనవరి ఐదో తేదీన విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ పడాల రఘు పిలుపునిచ్చారు. కరపలో శుక్రవారం జరిగిన ఫౌండేషన్ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి లక్ష మంది ఆ కార్యక్రమానికి వెళ్లేలా హిందువులను చైతన్య పరుస్తున్నామన్నారు. ఈసందర్భంగా హైందవ శంఖారావం కరపత్రాలు, స్టిక్కర్లను ఆవిష్కరించి పంచారు. సమరసత సేవా ఫౌండేషన్ మండల కోకన్వీనర్ కొక్కెరమట్ల రామకృష్ణ, ఆర్‌ఎస్‌ఎస్ యానాం ఖండ ప్రతినిధులు రామారావు, ముమ్మిడి శ్యామ్ సుందరరావు, మండల కన్వీనర్ కాదా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డుల పంపిణీ



విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం గాయత్రి, పాల్‌రాజు తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేటలోని ఏపీఎస్పీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియెట్ విద్యార్థినులకు శుక్రవారం ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఇంటర్మీడియట్ కళాశాల ఇన్‌చార్జి పాల్‌రాజు కృషితో సుమారు వెయ్యి మందికి ఈ కార్డులు సిద్ధం చేశారు. వాటిని హైస్కూల్ హెచ్‌ఎం గాయత్రి, సత్యవోలు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పంపిణీ చేశారు.

కాకినాడలో 'ఫ్యాషన్ ఫ్రూట్'



ఫ్యాషన్ ఫ్రూట్స్‌తో ఇంటి యజమాని విను

కాకినాడ రూరల్: ఈ చిత్రంలో కనిపిస్తున్న ఈ పండు పేరు ప్యాషన్ ఫ్రూట్. అరుదైన ఈ పండ్లు కాకినాడ వైద్యనగర్‌లో కేరళ నుంచి వచ్చి స్థిర పడిన సైకాలజిస్ట్ ఏపీజే విను ఇంట్లోని పాదుకు విరగ కాసాయి. ఉష్ణ మండలంలో పెరిగే ట్రాపికల్ ప్లాంట్ పండు దక్షిణ అమెరికాకు చెందిన పండుగా చెబుతారు. అమెజాన్ రెయిన్ ఫారెస్ట్‌లో పుట్టిన ప్యాషన్ ఫ్రూట్ తీపి రుచి, అరోమా సువాసనలతో ఆకర్షిస్తుందని వినుతెలిపారు. మధుమేహ రోగులు తింటే షుగర్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయని అన్నారు. ఊదా, పసుపు, ఆకుపచ్చ రంగుల్లో దొరుకుతుందని తొక్క గట్టిగా లోపల గుజ్జు విత్తనాలతో మెత్తగా ఉంటుందన్నారు. క్యాన్సర్‌ను నివారించే గుణం కూడా దీనికి ఉందని ఆయన తెలిపారు. తమ ఇంటి వద్ద తీగలపై పెరుగుతున్న ప్యాషన్ ప్లాంట్ కాయలు కాస్తోందని విను తెలిపారు.

వైభవ వేంకటేశ్వరునికి పూజలు

బోట్‌క్లబ్: స్థానిక సాంబమూర్తినగర్‌లోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రవణ నక్షత్రం సందర్భంగా శుక్రవారం పంచామృతాభిషేకాలు చేశారు. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో వివిధ రకాల పళ్ల రసాలతో అభిషేకించారు. అనంతరం స్వామి వారికి సహస్రనామార్చన చేశారు.

కరపలో...

యండమూరులో వేంచేసిన సామ్రాజ్యలక్ష్మి, గోదాదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వెంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణం కలియడంతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని వెంకటేశ్వర స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి, ప్రధాన అర్చకుడు పెద్దింటి సీతారామం పూజాదికాలు చేశారు.

నీడ లేక.. నిలువలేక..

- ఎవరికీ పట్టని ప్రయాణికుల పాట్లు
- షెల్టర్లు లేక సమీప షెడ్లు, చెట్లను ఆశ్రయిస్తున్న వైనం



పద్మప్రియ సెంటర్‌లో బస్సు కోసం రోడ్డు పక్కనే వేచి చూస్తున్న ప్రయాణికులు

బోట్‌క్లబ్: జిల్లా కేంద్రం కాకినాడ నగరంలో నిలబడేందుకు కాస్త జాగా లేక ప్రయాణికులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే ప్రాంతాల్లో సైతం బస్సు వచ్చేంత వరకు నిలబడాల్సిన పరిస్థితి నెలకొంది. ఏ శాఖ అధికారులూ పట్టించుకోకపోవడంతో ప్రయాణికులు ఎండలోను, వర్షంలోనూ బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. నగరంలో స్థానిక పద్మప్రియ సెంటర్, నూకాలమ్మ గుడి సెంటర్, జిల్లా పరిషత్ సెంటర్, కోటిపల్లి బస్టాండ్, అన్నమ్మఘాటి, సినిమా రోడ్డు, మున్సిపల్ ఆఫీస్ ప్రాంతాల్లో బస్సు షెల్టర్లు లేకపోవడంతో నిత్యం వందలాది మంది ప్రయాణికులు బస్సు కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంటోంది. రెండు జిల్లాలకు ఆరోగ్య ప్రదాయినిగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కూడా ప్రయాణికులు వేచి ఉండేందుకు సరైన బస్సు షెల్టర్ లేకపోవడంతో రోగులు, వారితో వచ్చే బంధువులు అనేక అవస్థలు పడుతున్నారు. ప్రతి రోజు జీజీహెచ్‌కు జిల్లా నుంచి 2 వేలకు పైగా రోగులు ఈ ఆస్పత్రికి వస్తుంటారు. స్థానిక వివేకానంద పార్కు వద్ద స్మార్ట్ సిటీ ఏసీ బస్సు షెల్టర్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం అక్కడ కూర్చోడానికి సరైన సదుపాయాలు లేకపోవడంతో ప్రయాణికులకు నిరుపయోగంగానే ఉంది. రాత్రి సమయాలలో ఈ బస్సు షెల్టర్ వద్ద లైటింగ్ సదుపాయం లేకపోవడంతో ప్రయాణికులు రోడ్డుపైనే నిలబడుతున్నారు. స్థానిక పద్మప్రియ సెంటర్ వద్ద ఇటీవల కొత్తగా బస్సులు ఆపుతున్నప్పటికీ అక్కడ కూడా ప్రయాణికులు కూర్చునేందుకు కనీసం ఎటువంటి సదుపాయాలు చేయలేదు. కోటిపల్లి అమలాపురం గోకవరం వంటి ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు బస్సు సదుపాయాలు తక్కువగా ఉంటాయి. దీంతో ప్రయాణికులు ఒక్కొక్కసారి గంటల తరబడి పడిగాపులు పడాల్సిన పరిస్థితి తలెత్తుతోంది. వర్షం వస్తే వర్షంలో తడిసి అక్కడ బస్సుల కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. ఎండలోనైనా గంటల తరబడి నిలబడాల్సిన దుస్థితి ఉంది. నిత్యం వేలాది మంది ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నప్పటికీ అటు ఆర్టీసీ అధికారులు కానీ కార్పొరేషన్ అధికారులు కానీ ఎటువంటి సదుపాయాలు కల్పించకపోవడం ప్రయాణికుల పాలిట శాపంగా మారింది. జిల్లా కేంద్రం కాకినాడలో ఈ దుస్థితి ఉండటం బాధాకరమని ప్రయాణికులు వాపోతున్నారు.

నిత్యం ఇబ్బందులు పడుతున్నాం



ఆటో మీద ప్రయాణం చేయడం నాకు ఇష్టం ఉండదు. ఒక్కొక్కసారి బస్సు ఆలస్యంగా వస్తుంది. దీంతో గంటకు పైగా బస్సు కోసం వేచి ఉండాల్సిన పరిస్థితి ఉంది. కూర్చుందామంటే టువంటి సదుపాయం లేదు. తప్పని పరిస్థితుల్లో బస్సు కోసం నిలబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉంటోంది.

– చోడిశెట్టి సుబ్రహ్మణ్యం, ప్రయాణికుడు

కనీస సదుపాయాలు కల్పించాలి



నేను ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాను. నిత్యం అమలాపురం, రాజమహేంద్రవరం, పెద్దాపురం, సూరంపాలెం వంటి ప్రాంతాలకు వెళ్తుంటాను. వర్షం వచ్చినా, ఎండకాసినా బస్సు కోసం రోడ్డుపైనే నిలబడాల్సిన పరిస్థితి ఉంది. బస్సు షెల్టర్ ఏర్పాటు చేసి కనీస సదుపాయాలు కల్పించాలి.

– కె.సతీష్, ప్రయాణికుడు



కుర్చీ, బెంచీలు లేక నిరుపయోగంగా ఉన్న కుళాయిచెరువు పార్కు వద్ద ఉన్న బస్సు షెల్టర్



జిల్లా పరిషత్ సెంటర్ కోటిపల్లి బస్టాండ్ వద్ద రోడ్డుపై ప్రయాణికుల పడిగాపులు

సైబర్ నేరాలపై విస్తృత ప్రచారం



ఎంపీడీఓ కార్యాలయంలో అతికించిన పోస్టర్ల వద్ద ఏఎస్ఐ సూరిబాబు

కరప: ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాలపై ప్రజలు అవగాహనతో ఉండాలని, మోసగాళ్ల మాయ మాటలకు మోసపోవద్దని ఎస్‌ఐ టి.సునీత, ఏఎస్‌ఐ వి.సూరిబాబు సూచించారు. సైబర్‌నేరాలపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్టు వారు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల వద్ద, గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద, బహిరంగ ప్రదేశాలలో సైబర్‌నేరాలు ఎలా జరుగుతున్నది, ప్రజలు ఎలా మోసపోతున్నదీ వివరిస్తూ పోస్టర్లను గోడలకు అతికించి, అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగులు, తక్కువ ధరకే విలువైన వస్తువుల విక్రయాలు, డిజిటల్ అరెస్టుల వంటి సైబర్ మోసగాళ్ల ఎత్తుగడలకు లోనుకావద్దని వారు సూచించారు. తెలియని వ్యక్తులు ఫోన్‌చేసి, విదేశీకోడ్‌లో ఫోన్లు వచ్చినా స్పందించకుండా ఉండటం మంచిదన్నారు. ఏఎస్‌ఐ సూరిబాబు శుక్రవారం కరప మండల ప్రజాపరిషత్ , రెవెన్యూ కార్యాలయాల వద్ద, పీహెచ్‌సీ వద్ద పోస్టర్లను దగ్గరుండి అతికించారు.

నేడు పేరెంట్, టీచర్స్ మీట్

కాకినాడ రూరల్: మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో మెగా పేరెంట్స్ – టీచర్స్ సమావేశాలు నిర్వహిస్తున్నామని, తల్లిదండ్రులు హాజరుకావాలని ఎంఈఓ వేణుగోపాల్ కోరారు. తమ పిల్లలు చదువుతున్న పాఠశాలల్లో వసతులు, విద్యా బోధన తెలుసుకుని వారి సూచనలతో పాఠశాలల అభివృద్ధికి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపడుతోందన్నారు. సమావేశం అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి భోజనం చేస్తారన్నారు.

జిల్లా క్రీడా మైదానంలో లాంగ్ జంప్ పిట్ ఏర్పాటు



లాంగ్ జంప్ పిట్ వద్ద డీఎస్‌డీఓ శ్రీనివాస్, హరీష్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా మైదానంలో లాంగ్ జంప్ పిట్ ఏర్పాటు చేసినట్టు డీఎస్‌డీఓ బి.శ్రీనివాసకుమార్ శుక్రవారం తెలిపారు. యూనిఫామ్ సర్వీస్ ఉద్యోగాలకు అవసరమైన ఫిజికల్ ఎగ్జామ్స్‌కు సాధన చేస్తున్న అభ్యర్థుల విన్నపం మేరకు సానా సతీష్‌బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ ఈ పిట్ ఏర్పాటు చేసినట్లు శ్రీనివాస్ తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్‌పై సర్పంచ్ ఫిర్యాదు

కాకినాడ రూరల్: మండలంలోని తిమ్మాపురం గ్రామ పంచాయతీలో జూనియర్ అసిస్టెంట్ యశ్వంత్ కుమార్‌పై ఆ గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీలో ఇటీవల బదిలీలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధుల్లో చేరిన యశ్వంత్ పెన్షన్లను వృద్ధులకు సకాలంలో ఇవ్వకుండా జాప్యం చేయడంతో పాటు నూతన గృహాలకు పన్నులు వేసేటప్పుడు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్టు ఆరోపించారు. ఇంటి పన్నుల సొమ్ములను పంచాయతీ ఖాతాలో వెంటనే జమ చేయకుండా రోజులు తరబడి జాప్యం చేయడంపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ తెలిపారు. సర్పంచ్ సమక్షంలోనే సదురు జూనియర్ అసిస్టెంట్‌ను పంచాయతీ కార్యదర్శి పిలిచి విధుల పట్ల నిర్లక్ష్యం చేయవద్దని హెచ్చరించారు. ఇంటి పన్నుల వసూళ్ల సొమ్ములు పంచాయతీ ఖాతాలో జమ చేయకుండా జాప్యం చేయడంపై నిలదీశారు.

అంబేడ్కర్ సేవలు అందరికీ ఆదర్శం

- కలెక్టర్ షణ్మోహన్
- రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళులు



డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్



అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో..



సభలో మాట్లాడుతున్న మాజీ వీసీ డాక్టర్ బాబ్జీ

కాకినాడ సిటీ: భారతదేశానికి అత్యున్నత రాజ్యాంగాన్ని అందించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అరుదైన వ్యక్తి అని, దేశానికి ఆయన చేసిన సేవలు ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాల్సిన ఆవశ్యకత ఉందని కలెక్టర్ షణ్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఇంద్రపాలెం జంక్షన్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో కలసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ రచన దగ్గర నుంచి ఏదో ఒక రూపంలో అంబేడ్కర్ సేవలు నిత్యం మనకు గుర్తొస్తూనే ఉంటాయన్నారు. మహా మేధావిగా, సంఘ సంస్కర్తగా, న్యాయశాస్త్రవేత్తగా దేశానికి ఆయన ఎంతో సేవ చేశారన్నారు. అణగారిన, బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి ఆయన అహర్నిశలు కృషి చేశారని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో సీపీవో పి త్రినాథ్, ఇన్‌చార్జి జిల్లా సంక్షేమశాఖాధికారి జి.శ్రీనివాసరావు, బీసీ సంక్షేమశాఖాధికారి ఎం.లిల్లీ, జిలా క్రీడాభివృద్ధి అధికారి బి శ్రీనివాసకుమార్, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ డీడీ డి.నాగార్జున, వివిధ దళిత ప్రజా ఉద్యమ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు అందరికీ అందించాలి

భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవడానికి అన్ని వర్గాలు ఐక్యమై, ఆ ఫలాలను అందరికీ అందించడమే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు మనమిచ్చే ఘనమైన నివాళి అని ఎన్టీయార్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వీసీ, బుద్ధ విహార్ అధ్యక్షుడు డాక్టర్ కె.బాబ్జీ అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్‌లో భారత రాజ్యాంగ విశిష్టతపై సదస్సు నిర్వహించారు. సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో అంబేడ్కర్ సేవలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సత్య స్కాన్ అధినేత డాక్టర్ కాదా వెంకటరమణ మాట్లాడుతూ అంబేడ్కర్ అందరి వాడు అన్నారు. కార్యక్రమంలో సీనియర్ అడ్వకేట్ జవహర్ అలీ, సీనియర్ జర్నలిస్ట్ మలసాని శ్రీనివాస్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దడాల సుబ్బారావు, బామ్‌సెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాముడు తదితరులు అంబేడ్కర్ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో సామాజిక న్యాయ సాధన సమితి, అంబేడ్కర్ బుద్ధ విహార్ నాయకులు, పలువురు దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అన్నమఘాటీ సెంటర్‌లో

స్థానిక అన్నమఘాటీ సెంటర్‌లోని అంబేడ్కర్ వర్ధంతిని దోకుబుర్ర భద్రం, అయితాబత్తుల రామేశ్వరరావు తదితరుల ఆధ్వర్యంలో నిర్వహించారు. అంబేడ్కర్‌తో పాటు, బాబూ జగ్జీవన్‌రామ్, జ్యోతిబాపూలే విగ్రహాలకు వారు నివాళులర్పించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

సీఐటీయూ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతిని నాయకులు మలకా వెంకటరమణ, జి.బేబీరాణి, దువ్వా శేషుబాబ్జీ, సీహెచ్ రాజ్‌కుమార్, చంద్రమళ్ల పద్మ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

కరపలో..

కరప: స్థానిక పీహెచ్‌సీ ఎదుట మండల అంబేడ్కర్ యువజన సేవా సంఘం అధ్యక్షుడు గుబ్బల రామకృష్ణ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత విగ్రహానికి నివాళులు అర్పించారు. అలాగే జి.భావారంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, కరప పంచాయతీ కార్యాలయం పక్కన అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, ఎస్సీ నాయకుడు సాదే లోహిదాస్, యండమూరులో సర్పంచ్ మార్నెళ్ల శివ, మాజీసర్పంచ్ మార్నెళ్ల వెంకటరమణ, వేములవాడ శివారు పోలినాటివారి వీధిలో మండల ఎస్సీ నాయకుడు వజ్రపు కామేశ్వరరావు తదితరులు అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులు అర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో కల్సి ఏఓ బీఎల్ నరసింహం అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.



కరప పీహెచ్‌సీ ఎదురుగా ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్సీనాయకులు

రూరల్ మండలంలో..

కాకినాడ రూరల్: మండల పరిషత్ కార్యాలయంలోని అంబేడ్కర్ విగ్రహానికి డీఎల్‌డీఓ ప్రసాద్, ఎంపీడీఓ సతీష్ తదితరులు, తహసీల్దార్ కార్యాలయంలోని అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ కుమారి తదితరులు నివాళులర్పించారు. అచ్చంపేట జంక్షన్ వద్ద నన్నయ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ కమలకుమారి, అధ్యాపకులు, సిబ్బంది అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు.




కాకినాడ రూరల్ మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

షష్ఠి వేడుకలకు ఆలయాల ముస్తాబు



రామారావుపేటలోని శివాలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

బోట్‌క్లబ్: సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయాల నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక సంతచెరువు కనకదుర్గ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక దేవాలయంవీధిలోని బాలాత్రిపుర సుందరి సమేత భీమేశ్వర ఆలయం ప్రాంగణంలోని సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈఓ రాజేశ్వరరావు తెలిపారు. స్థానిక సంతచెరువు గట్టు వద్ద నున్న నాగేంద్రస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేశారు. స్థానిక రామారావుపేటలోని అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర ఆలయ ప్రాంగణం, జగన్నాథపురం, సాంబమూర్తినగర్‌లోని శివాలయం ప్రాంగణం, స్థానిక విద్యుత్‌నగర్ వినాయకుడి గుడి సమీపంలో ఉన్న నాగేంద్రస్వామి ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో ఉదయం ఏడు గంటల నుంచి కావడిసేవ, విశేష అభిషేకాలు, అర్చన, సుబ్రహ్మణ్య హోమం నిర్వహిస్తున్నట్లు ఆలయ పర్సన్ ఇన్‌చార్జ్ గోపాలకృష్ణ తెలిపారు.

పంచారామ క్షేత్రంలో

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రం బాలాత్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వరస్వామి ఆలయంలోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో శనివారం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి వేడుకలు నిర్వహిస్తున్నట్టు ఈఓ బళ్ల నీలకంఠం తెలిపారు. ఇందులో భాగంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాలు, పూజలు, పట్టు వస్త్రాలతో అలంకరణలు, అనంతరం భక్తుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నట్టు తెలిపారు. అలాగే మండల పరిధిలోని పనసపాడు గ్రామంలో సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో షష్ఠి ఉత్సవాలు నిర్వహించనున్నామని, అనంతరం అన్నదానం చేయనున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

లింగ నిర్ధారణ చేస్తే కఠిన చర్యలు

- ఆర్డీఓ మల్లిబాబు



లింగ నిర్ధారణపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, మేనరిక వివాహాలు, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆర్డీఓ ఎస్.మల్లిబాబు అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఉప జిల్లా స్థాయిలో వివిధ శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉన్న ప్రాంతాలపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రధానంగా గర్భస్థ పిండం ఆరోగ్య పర్యవేక్షణకు సంబంధించిన పరీక్షలను లింగ నిర్ధారణకు దుర్వినియోగం కాకుండా అల్ట్రా సౌండ్ స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా పెట్టామన్నారు. అల్ట్రా సౌండ్ వైద్య పరీక్షలు లింగ నిర్ధారణకు ఉపయోగించుకోవడం చట్ట రీత్యా నేరమన్నారు. డివిజన్ స్థాయిలో గుర్తింపు పొందిన 11 ప్రభుత్వ, 104 ప్రైవేటు మొత్తం 115 స్కానింగ్ సెంటర్లు ఉన్నాయన్నారు. వీటిపై డెకాయ్ ఆపరేషన్లు, ఆకస్మిక తనిఖీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రామస్థాయిలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లు సంయుక్తంగా గర్భిణుల ఇళ్లను సందర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ కేవీ సుబ్బరాజు మాట్లాడుతూ మొదటి సారి ఈ చట్ట పరిధిలో చేసిన ఏదేని తప్పిదానికి మూడేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా విధిస్తారన్నారు. అదే తప్పు పునరావృతమైతే ఐదేళ్ల వరకు జైలు, రూ.50 వేల జరిమానా విధిస్తారన్నారు. సమావేశంలో వన్ టౌన్ ఎస్‌ఐ సీహెచ్ కుమార్, జీజీహెచ్ రేడియాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ నురున్నీసా బేగం, పిఠాపురం పీడియాట్రిషియన్ డాక్టర్ ఎం.కీర్తిప్రియ, ఎన్జీవోలు కె.సింహాద్రి, డి.నాని, హెల్త్ ఎడ్యుకేటర్ పి. సత్యవతి, గోవింద్, ఎల్.శృతి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు విజయవంతం చేయండి

కాకినాడ రూరల్: రెవెన్యూ సదస్సులను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని రెవెన్యూ అధికారులు, సర్వేయర్లను ఆర్డీవో మల్లిబాబు కోరారు. సర్పవరం జంక్షన్ వద్ద కాకినాడ రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీసర్వేలో వచ్చిన ఫిర్యాదులు, వినతులపై ప్రస్తుత రెవెన్యూ సదస్సుల్లో చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ యంత్రాంగం ప్రజల వద్దకు వెళ్లి భూ సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. వచ్చిన ఫిర్యాదులను ఆర్టీజీఎస్ గ్రీవెన్స్ పోర్టల్‌లో నమోదు చేయాలని 22ఏ జాబితాలు కూడా అందుబాటులో ఉంచాలని భూ కొలతల్లో తేడాలు, సర్వే నంబర్లలో మార్పులు, వారసత్వ పేర్లు నమోదు తదితర రెవెన్యూ అంశాలపై వినతులు, ఫిర్యాదులు స్వీకరించాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ కుమారి, డీటీ కల్యాణ్ చక్రవర్తి, రీ సర్వే డీటీ సురేష్, ఆర్ఐ భవాని, మండల సర్వేయర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గత ఫిర్యాదులు, వినతులపై చర్యలు

గత రీసర్వేలో వచ్చిన ఫిర్యాదులు, వినతులపై ప్రస్తుత సదస్సులలో చర్యలు తీసుకోవాలని ఆర్డీవో అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో తహసీల్దార్లు, సర్వేయర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభల్లో వచ్చిన ఫిర్యాదులను ఆర్‌టీజీఎస్, గ్రీవెన్స్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. 22ఏ జాబితాలు కూడా అందుబాటులో ఉంచాలని, అసైన్డ్ జాబితాలు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ ఎస్ఎల్ఎన్ కుమారి, డీటీ ఆర్.కళ్యాణ్ చక్రవర్తి, కె.సురేష్, భవాని, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.